ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 08.06.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. కేంద్ర బొగ్గు, గనుల శాఖలో చేపట్టిన సంస్కరణల ద్వారా కీలక రంగాల్లో బొగ్గు, క్రిటికల్ మినరల్స్ ముఖ్యపాత్ర పోషిస్తూ.. దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు.

2. అన్ని రకాల పౌర సేవలకు సంబంధించిన బిల్లులను ప్రజలు ఒకే చోట చెల్లించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం 'క్యూర్1' అనే మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

3. హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో ఆస్తమా రోగులకు చేప ప్రసాదం ఈరోజు నుంచి రేపటి వరకు పంపిణీ చేస్తారు.

4. ఆకాశవాణి ఈరోజు 90 వసంతాల వేడుకలు జరుపుకుంటోంది.

-------------------------------

కిషన్ రెడ్డి మంత్రి

కేంద్ర బొగ్గు, గనుల శాఖలో చేపట్టిన సంస్కరణల ద్వారా కీలక రంగాల్లో బొగ్గు, క్రిటికల్ మినరల్స్ ముఖ్యపాత్ర పోషిస్తూ.. దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. తద్వారా భారీగా ఉపాధి అవకాశాలు కల్పిస్తూ.. వేల కోట్ల రూపాయల వృద్ధిని నమోదు చేస్తోందన్నారు. ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ 12 యేళ్లు, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రిగా తాను రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈరోజు కిషన్ రెడ్డి

మీడియాతో మాట్లాడారు. గతంలో యూపీఏ హయాంలో మాదిరిగా ఇప్పుడు కుంభకోణాలుగానీ, అవినీతి గానీ లేదన్నారు. గత యేడాది 8శాతం, ఈ యేడాది 4శాతం బొగ్గు దిగుమతులు తగ్గించడంలో విజయవంతం అయ్యామన్నారు. కోల్ గ్యాసిఫికేషన్ విధానం ద్వారా సాంకేతికతను వినియోగించుకుంటున్నామని చెప్పారు. నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ ద్వారా అర్జెంటీనాలో ఐదు మినరల్ బ్లాక్స్ ను ప్రారంభించామని, ఆస్ట్రేలియా వంటి దేశాలతో ఒప్పందాలు చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. క్రిటికల్ మినరల్స్ రంగంలో 4లక్షల కోట్ల పెట్టుబడులు ప్రైవేటు రంగం ద్వారా రానున్నాయని వివరించారు. వీటి వల్ల లక్ష మందికి ఉపాధి కల్పించడంతో పాటు.. 3లక్షల కోట్ల విదేశీ మారకద్రవ్యం మిగులుతుందన్నారు.

ఎంఎస్ఎం

------------------------------

**క్యూర్ 1**

అన్ని రకాల పౌర సేవలకు సంబంధించిన బిల్లులను ప్రజలు ఒకే చోట చెల్లించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం 'క్యూర్1' అనే మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. జీహెచ్ఎంసీ, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రాంతాలకు చెందిన వారు ఈ యాప్‌ను ఉపయోగించుకోవచ్చు. క్యూర్ పరిధిలోని పౌరులు తమ ఆస్తిపన్ను, విద్యుత్ బిల్లులు, నీరు, మురుగునీటి సదుపాయాల బిల్లులతోపాటు ట్రాఫిక్, ఇతర చలాన్లు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులను క్యూర్1 యాప్‌లో చెల్లించవచ్చు.

**డెస్క్**

----------------------------------

**చేప ప్రసాదం**

హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో ఆస్తమా రోగులకు చేప ప్రసాదం ఈరోజు నుంచి పంపిణీ చేస్తారు. ఈరోజు రాత్రి 9 గంటల నుంచి రేపు రాత్రి వరకు ఈ కార్యక్రమం విరామం

లేకుండా కొనసాగనుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారికోసం అధికారులు నాంపల్లికి ప్రత్యేక బస్సులు కూడా నడుపుతున్నారు.

**డెస్క్**

-----------------------------------

**భట్టి**

జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో రేపు ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క పర్యటించనున్నారు. సభా స్థలి వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ఈరోజు స్థానిక శాసనసభ్యులు కడియం శ్రీహరి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించారు. ఈ పర్యటనలో 60 కోట్ల పైచిలుకు విలువైన 7 విద్యుత్ సబ్ స్టేషన్లకు ఉప ముఖ్యమంత్రి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్న సందర్భంగా.. చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత శాఖ అధికారులతో చర్చించారు.

**పీటీసీ - జనగామ**

--------------------------------

**ఏలేటి**

రాష్ట్రంలో ఇకనుంచి విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ పోరాటం చేయనుందని ఆపార్టీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. నిన్న బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు, శాసనసభ, శాసనమండలి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులు పెడుతుంటే 'రైతు గోస-బీజేపీ భరోసా' చేపట్టి రైతుల సమస్యలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లగలిగామని, అదేవిధంగా విద్యార్థుల సమస్యలపై కూడా సమావేశంలో సుదీర్ఘంగా చర్చించామని ఆయన తెలిపారు.

**డెస్క్**

-------------------------

**మెడికల్**

హైదరాబాద్‌ను అంతర్జాతీయ మెడికల్ టూరిజం క్యాపిటల్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజాన్ని ప్రోత్సహించేందుకు అవసరమైన చర్యలపై అధ్యయనం చేసి, సిఫార్సులు చేయడానికి ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

**డెస్క్**

------------------------------

**సూర్యఘర్ ముఫ్తీ బిజిలి యోజన**

ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్తీ బిజిలి యోజన పథకాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కరీంనగర్ జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ రవీందర్ కోరారు. ఆకాశవాణితో ఆయన మాట్లాడుతూ...

**బైట్ - ఆర్. రవీందర్**

**పీటీసీ - కరీంనగర్**

---------------------------------------

**AKASHVANI 90 YEARS**

ఆకాశవాణి ఈరోజు 90 వసంతాల వేడుకలను జరుపుకుంటోంది. 1936 జూన్ 8వ తేదీన 'ఇండియన్ స్టేట్ బ్రాడ్‌కాస్టింగ్ సర్వీస్' పేరును ఆల్ ఇండియా రేడియోగా మార్చారు. దేశ సాంస్కృతిక, సమాచార, ప్రసార రంగాల చరిత్రలో ఈ రోజు ఒక సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజుగా నిలిచిపోయింది.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆల్ ఇండియా రేడియో వేగంగా విస్తరించింది. 1956లో దీనికి ఆకాశవాణి అనే పేరు పెట్టారు. నేడు ఆకాశవాణి దేశవ్యాప్తంగా 591 స్టేషన్లను నిర్వహిస్తూ, దేశ జనాభాలో 98 శాతానికి పైగా చేరువైంది.

**NSD**

------------------------------

**రేవంత్**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 1,511 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిన్న సాయంత్రం శంకుస్థాపన చేశారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ భవనం, ఏఓసీ సెంటర్‌లో ప్రత్యామ్నాయ రహదారులు, టీకేఆర్ కాలేజీ జంక్షన్ వద్ద ఆరు లేన్ల ఫ్లైఓవర్, 100 పడకల జిల్లా ఆస్పత్రి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా క్యూర్-1 యాప్‌ను కూడా ప్రారంభించారు.

**పీటీసీ - మల్కాజ్ గిరి**

-----------------------------

**నిమ్స్**

హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (NIMS) డైరెక్టర్‌గా డాక్టర్ రాహుల్ దేవరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాహుల్‌ను నియమిస్తూ ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ ఉత్వర్వులు జారీ చేసింది.

**డెస్క్**

----------------------------

**అభ్యసన**

కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ విడుదల చేసిన 2024-25 పనితీరు గ్రేడింగ్ సూచికల నివేదికలో జనగామ జిల్లా విశేష ప్రతిభ కనబరిచింది. అభ్యసన సామర్థ్యం, నాణ్యత ప్రమాణాల విభాగంలో 209 స్కోర్‌తో రాష్ట్రంలో తొలి స్థానాన్ని, పాఠశాల విద్య పనితీరు విభాగంలో 357 మార్కులతో రెండో స్థానాన్ని జిల్లా దక్కించుకుంది.

**పీటీసీ - జనగామ**

--------------------------

**వర్షాలు**

జనగామ జిల్లాలో నిన్న రాత్రి ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. నర్మేట, పెల్దండ, అమ్మాపురం, మల్కాపేట గ్రామాల్లో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం వర్షానికి తడిసిపోయింది. తరిగొప్పుల మండలంలోని పలు గ్రామాల్లో బలమైన గాలులకు చెట్లు విరిగి విద్యుత్ వైర్లపై పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

**పీటీసీ - జనగామ**

------------------------------

**రీల్స్**

రాజన్న సిరిసిల్ల జిల్లా పోతిరెడ్డిపల్లి ఫారెస్ట్ రిజర్వ్ బ్లాకులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన అర్బన్ ఫారెస్ట్ పార్క్ పై విస్తృత ప్రచారం కల్పించనున్నట్లు జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ తెలిపారు. అందరినీ ఆకర్షించేలా పార్క్ పై రీల్స్ పోటీలను నిర్వహిస్తామని తెలిపారు.

**పీటీసీ - సిరిసిల్ల**

-------------------------------

**నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్**

కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్ కు రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి 41 మంది విద్యార్థులు ఎంపిక య్యారని జిల్లా విద్యాశాఖ అధికారి జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. గత నవంబరులో జిల్లాలోని 953 మంది 8వ తరగతి విద్యార్థులు పరీక్ష రాశారని.. వారిలో 41 మంది స్కాలర్ షిప్ పొందేందుకు అర్హత సాధించారన్నారు.

**పీటీసీ - సిరిసిల్ల**

------------------------------

**లోక్ అదాలత్**

ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నర్సింహకోరారు. లోక్ అదాలత్ గోడపత్రికను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. చిన్న వివాదాలతో కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు.

**పీటీసీ - సూర్యాపేట**

----------------------------

**కలెక్టర్**

వర్ష సూచన నేపథ్యంలో వరి కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. ఇప్పటికే తూకం వేసిన వడ్లను వెంటనే మిల్లులు, గోదాములకు తరలించాలన్నారు. చివరి రైతు ధాన్యం కొనుగోలు చేసేవరకు కూడా అధికారులు అలసత్వం వహించవద్దని అన్నారు.

**పీటీసీ - సూర్యాపేట**

------------------------------

**ట్రాఫిక్ ఆంక్షలు**

నల్లగొండలో ట్రాఫిక్ రద్దీని క్రమబద్ధీకరించడంతో పాటు పాఠశాలల పునఃప్రారంభం దృష్ట్యా భారీ వాహనాలు, లారీలు, ట్రాక్టర్లు రాకపోకలపై నేటినుంచి ప్రత్యేక ఆంక్షలు అమలు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ మహాలక్ష్మయ్య తెలిపారు.

**పీటీసీ - నల్గొండ**

---------------------------------

**కోర్సు**

చేనేత కార్మికుల కుటుంబాలకు చెందిన పదో తరగతి పూర్తయిన విద్యార్థులను ఐఐహెచ్ టి కోర్సులో చేర్పించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా చేనేత జౌళి శాఖ కోఆర్డినేటర్ వేముల మార్కండేయులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్ లోని కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ డిప్లొమా (ఐఐహెచ్ఐటి) కోర్సులో విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో చేరి విద్యను అభ్యసించాలని సూచించారు..

**పీటీసీ - సిరిసిల్ల**

-----------------------------

**బైక్ ర్యాలీ**

మంచిర్యాల జిల్లా చెన్నూర్ లో పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అటవీ శాఖ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

**పీటీసీ - మంచిర్యాల**

-----------------------------------